క్లుప్తంగా

తిరగబడ్డ లారీ


వృద్ధాశ్రమం ఎదుట బోల్తాపడ్డ లారీ

కొయ్యలగూడెం: స్థానిక కల్ప వృక్షం వృద్ధాశ్రమం ఎదుట జాతీయ ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున లారీ బోల్తాపడింది. హైదరాబాదు నుంచి తాడేపల్లిగూడెంకు మైదా లోడుతో వెళుతున్న లారీ ఎదుట వెళుతున్న లారీని ఓవర్టేక్ చేస్తున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు మార్జిన్ నుంచి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి గ్రామ దళితవాడలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, ర్యాంపు పనులను స్థానిక సర్పంచ్ ముప్పిడి విజయకుమారి శుక్రవారం ప్రారంభించారు. గ్రామ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం నెల రోజుల్లో పూర్తిచేస్తామని, తద్వారా సంపూర్ణ సీసీ రోడ్లు వేసిన ఘనత సాధిస్తామని ఆమె తెలిపారు. వార్డు సభ్యులు ఏలేటి భాస్కర్, పి.రవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు


కళ్లచెరువులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ అనురాధ

కామవరపుకోట: గ్రామాల్లో పారిశుద్ధ్యని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ ఆదేశించారు. శుక్రవారం కామవరపుకోట మండలం కళ్ల చెరువు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. గ్రామంలో సమిత్వ సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సరళ కుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ


ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వేలేరుపాడు: రామవరం పంచాయతీలో రైతులకు యూరియా, డీఏపీలను సర్పంచ్ పిట్టా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. రామవరంలో సుమారు 5 వేల ఎకరాలు వ్యవసాయం సాగులో ఉందని తెలిపారు. 170 బస్తాలు యూరియా, డీఏపీ 170 బస్తాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఎకరానికి ఒక బస్తా మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో, కౌలు రైతులకు కూడా ఎరువులు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు కోరారు.

ఎంఎల్ఎస్ పాయింట్ల తనిఖీ


తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ వినూత్న

లింగపాలెం: ధర్మాజీగూడెం ఎంఎల్ఎస్ పాయింట్లను సబ్‌కలెక్టర్ వినూత్న తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బియ్యం, పంచదార, కంది పప్పు స్టాక్‌ను పరిశీలించారు. గోడౌన్ నుంచి రేషన్ డీలర్లు బియ్యం తీసుకువెళ్లే ముందు,రేషన్ షాపులో బియ్యం దించుకోగానే వేలిముద్రలు వేయాలని వినూత్న అన్నారు. గోడౌన్‌లో అక్రమంగా పట్టుబడిన 34 టన్నుల రేషన్ బియ్యాన్ని తనిఖీ చేసి, బియ్యం పాడవ్వకముందే వేలం పాటకు సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ నాజీముల్లాషా పాల్గొన్నారు.

డ్రై డే ఫ్రైడే

జంగారెడ్డిగూడెం: స్థానిక వైఎస్సార్ నగర్, ఆర్ అండ్‌ఆర్ కాలనీలో ఫీవర్ సర్వే, ఫ్రై డే డ్రైడే కార్యక్రమం శుక్రవారం అర్బన్ దళితపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. ఇళ్లలో వాడే నీటి తొట్టెలో, నీటి పీపాలు, పాత్రలు డబ్బాలు, రోళ్లు, డ్రములు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో నీటి నిల్వలు లేకుండా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి


చింతలపూడి : రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



కొయ్యలగూడెం : తెలుగు అక్షరాల్లో ఒదిగిన విద్యార్థులు

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మలాంటి మాతృభాషను కాపాడటానికి గిడుగు వెంకట రామ్మూర్తి పంతుల చేసిని కృషికి గుర్తింపుగా ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అధ్యాపకులు వి.మదన్ మోహన్, బి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాస్, శంకర పోలయ్య, ఎ.వెంకటేశ్వరరావు, విన్నీ తేజ, పి.రాజబాబు, ఎండీ అంజాద్ ఆలీ, హరి ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: మండలంలో తెలుగు భాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరావు అధ్యక్షతన గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యవహారిక భాష ఆవశ్యకతను మల్లేశ్వర రావు వివరించారు. తెలుగు అధ్యాపకులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను గుర్తుచేశారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలుక ప్రశంసా పత్రాలు అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు. రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన రామ్మూర్తికి నివాళులర్పించారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: తెలుగు భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు హై స్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషను దివంగత గిడుగు రామ్మూర్తి పంతులు కృషితో వ్యవహారిక భాషగా గుర్తింపు పొందిందని బయన్నగూడెం, సరిపల్లి రోడ్డులో ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, మహేష్‌లు పేర్కొన్నారు. తెలుగు అక్షరాల ఆకృతితో విద్యార్థులు కూర్చుని ఆకట్టుకున్నారు. కొయ్యలగూడెం లైబ్రరీ, ప్రకాశం కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతరత్న హాకీ క్రీడాకారుడు దివంగత ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం ప్రాముఖ్యత గురించి పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.


జంగారెడ్డిగూడెం : మాట్లాడుతున్న తెలుగు ఆచార్యులు మాధవి


ద్వారకాతిరుమల : తెలుగు వెలుగు, అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తెలుగు పత్రికలు – పఠన ప్రయోజనాలు

జంగారెడ్డిగూడెం: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా చత్రపతి శివాజీ శ్రీ శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు పత్రికలు – పఠన ప్రయోజాలు అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఆచార్యులు ఎం మాధవి వార్తాపత్రికల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రతిభా పాఠశాలలో ప్రిన్సిపాల్ కాసర లక్ష్మీ సరోజా రెడ్డి నేతృత్వంలో విద్యార్థులు తెలుగు భాషకు సంబంధించిన నృత్యాలను ప్రదర్శించారు. వివిధ వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుభాష్ రెడ్డి, వెంకట్రావు, పూర్ణిమ, అనిత, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం సోమశేఖర్ గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, ప్రతిభా పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేషు కుమారి అన్నారు. స్థానిక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు రమేష్ విద్యార్థులకు పద్య పఠనం, క్విజ్, వక్తృత్వం , వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. గుణ్ణంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ వేడుకలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక మెట్ట మీద సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ మరియు లైన్ నిర్మాణ నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నీ రకాల సర్వీస్ లకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. సాలిపేట్, జేపీ సెంటర్, త్రివేణీ ఏరియా, సుబ్బారెడ్డి కాలనీ, రాజుల కాలనీ, అశ్వారావుపేట రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి: రాఘవపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గణిజర్ల 24 గంటల ఫీడర్, గణిజర్ల ఏజీఎల్ ఫీడర్లకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, శెట్టివారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని నామవరం ఫీడర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటకు వరకు, శంఖుచక్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యసాయి ఫీడర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని రేచర్ల 24 గంటల ఫీడర్‌కు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, రేచర్ల ఏజీఎల్ ఫీడర్లకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

బేరన్ కూల్చివేత అన్యాయం

బుట్టాయగూడెం: అన్యాయంగా తన బేరన్ కూల్చారని సూర్పవారిగూడెంకు చెందిన బల్లా భూలక్ష్మి అనే గిరిజన మహిళ వాపోయింది. 'ముప్పినవారిగూడెంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి నాలుగు బేరన్‌లు ఒక షెడ్‌ను రూ.35 లక్షలకు కొన్నాను. ఈ మేరకు సొమ్ము చెల్లించినప్పటికీ మరో రూ.8 లక్షలు అడుగుతున్నాడు. రెండు బేరన్లు మాత్రమే నా పేరును ఉన్నాయి. మిగిలిన రెండు బేరన్లు నా పేరున మార్చిన తర్వాత సొమ్ము చెల్లిస్తానని చెప్పారు. మూడు రోజుల క్రితం షెడ్‌లో నేను, నా కుమారుడు నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఆ వ్యక్తితోపాటు మరికొందరు వచ్చి దాడి చేశారు. బేరన్‌ను కూడా కూల్చివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాకు పూర్తి న్యాయం చేయాలి' అని భూలక్ష్మి పేర్కొంది.

ద్వారకాతిరుమలలో అన్నసమారాధన


ద్వారకాతిరుమల : చెరువు వీధిలో అన్నసమారాధన


కొయ్యలగూడెం : గణనాథుని జంబో లడ్డు

ద్వారకాతిరుమల: స్థానిక చెరువు వీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెస్సార్ ట్రస్ట్ అధినేత మొగతడకల శ్రీనివాసరావు, ఓం ప్రకాష్ చౌదరి, బద్రి, చిలుకూరి ధర్మారావు, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, చిలుకూరి చంద్రం, శ్రీకాంత్, అంజి, పాకనాటి శేషు, బాబి తదితరులున్నారు. ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద కూడా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

లంబోదరుడుకి జంబో లడ్డు

కొయ్యలగూడెం: గణపతి నవరాత్రులలో భాగంగా స్థానిక గణేష్ సెంటర్లోని గణపతి ఆలయానికి 50 కేజీల జంబో లడ్డును ఉమా స్టూడియో ప్రొప్రైటర్ ఏటా సమర్పించే ప్రసాదంలో భాగంగా భారీ లడ్డును స్వామివారికి శుక్రవారం నైవేద్యంగా అందజేశారు. తొమ్మిది రోజులు స్వామివారి వద్ద ఉంచి ముగింపు సందర్భంగా లడ్డు వేలం పాట నిర్వహిస్తామని గణపతి యువజన సేవా సంఘం పేర్కొంది. తహసీల్దార్ కార్యాలయం వెనక మార్వాడి బాలలు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. రేపల్లెవాడ రామాలయం వద్ద శనివారం ఉత్సవ ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

చలో విజయవాడ పోస్టర్ విడుదల


చలో విజయవాడ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగ దుర్గారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికలు ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయం, నగరపాలక సంస్థ కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: సెప్టెంబర్ 1న సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ మండల కార్యదర్శి వెలుగు ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావొస్తున్నా ఉద్యోగుల డీఏ బకాయిలు ఇంతవరకూ చెల్లించలేదని ప్రసాద్ ఆరోపించారు. ఐఆర్ హామీని అమలు చేయలేదన్నారు. ఉపాధ్యాయులు, ఎంపీడీఓ సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెడితే గద్దె దించుతాం

కామవరపుకోట: విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టడంతో పాటు సర్దుబాటు చార్జీల పేరుతో నిత్య వినియోగదారులపై మోయలేని భారం మోపితే చూస్తూ ఊరుకోమని గద్దె దించడానికి ప్రజా ఆందోళన నిర్వహిస్తామని సీపీఐ, ఏఐటీయూసీ, బీకేఎంయూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ శుక్రవారం స్థానిక చౌతన సెంటర్‌లో ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్లు ఎక్కడ పెడుతున్నా గ్రామాల్లోని ప్రజలంతా ఐక్యమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీ పెద్దలు ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారమోపితే సహించేది లేదని హెచ్చరించిన విషయాన్మిన గుర్తుచేశారు. నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పెంచే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ తాడిగడప వెంకట సత్తిరాజు, మండల కార్యవర్గ సభ్యులు గుమ్మడి లక్ష్మణరావు, చలమాల శ్రీనివాసరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బీవీ రాఘవులు, నల్లమోతుల అప్పన్న, కోతాటి వెంకటేశ్వరరావు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కంకిపాటి పుల్లయ్య, మల్ల చెన్నకేశవరావు, అడపా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చౌతన సెంటర్లో ధర్నా చేస్తున్న నాయకులు

ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం



జంగారెడ్డిగూడెం : డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రీడలు


బుట్టాయగూడెం : విద్యార్థులకు కుర్చీల పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో త్రో బాల్, కబడ్డి, హై జంప్, వాలీబాల్, క్రికెట్, పోటీలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యాన్ని మానసిక వికాసాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ క్రీడా కౌశలాన్ని వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ నిట్టా వినయ్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ఎం మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మేరా యువ భారత్ సహకారంతో మమత సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ జి.కుసుమ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. మమత సర్వీస్ ఆర్గనైజర్ కాకర్ల రాణి, షైన్ ఆర్గనైజేషన్ ఎన్‌జీఓ ప్రతినిధి జానెక్స్, తదితరులు పాల్గొన్నారు.

జెట్టిని కలిసిన పట్టణ ప్రచార కమిటీ

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ జంగారెడ్డిగూడెం పట్టణ ప్రచార కమిటీని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు ఆదేశాల మేరకు నియమించారు. ప్రచార కమిటీ అధ్యక్షుడిగా వెన్నపూస కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లవరపు నాగపోసు, సైదం నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా ఉల్లపు రవి, తమ్మిశెట్టి సాయి, శిలరపు ప్రశాంత్, కొప్పుల భాగ్యరాజ్, కార్యదర్శులుగా షేక్ బాబా వల్లి, కట్ట మహేష్, బలగం లక్ష్మీనారాయణ, చిత్రాల వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా తీగరెడ్డి దుర్గారావు, చలపాక నాగరాజు, దండాగుల వెంకటేశ్వరరావులు నియమితులయ్యారు. వీరు శుక్రవారం పార్టీ మచిలీపట్నం పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును, నాయకులు జెట్టి ఆదిత్య, పట్టణాధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్త, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకన్నలను మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు.


గురునాథరావుతో వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రచార నూతన కమిటీ

బాల్య వివాహాలను అరికట్టాలి

బుట్టాయగూడెం: తల్లిదండ్రులు పెళ్లి వయస్సు రాకుండానే పిల్లలకు పెళ్లి చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిషేదంపై ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తోన్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల నిషేద చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుసుమ, బార్ అసోసియేషన్ సభ్యులు ఏవీవీ భువనేశ్వరి, డీఆర్‌వీ కృష్ణ, బల్లే సాయికుమారి, తోట పద్మిని, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అచ్యుత శ్రీనివాసరావు

ఆర్థిక స్వావలంబన సాధించాలి


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న ఉమర్ ఆలీషా

పోలవరం రూరల్: పురుషులకు దీటుగా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. మండలంలోని వింజవరం, కొమ్ముగూడెం, బక్క బండావారిగూడెంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను శుక్రవారం అమర్ అలీషా సందర్శించారు. ముందుగా పట్టిసీమలోని గోదావరికి ప్రత్యేక పూజలు చేసి, హారతి ఇచ్చారు. కార్యక్రమంలో విజవరం సర్పంచ్ కొక్కిర వెంకటలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు దండు పద్మావతి, నంబూరి శిరీష, ట్రస్ట్ కన్వీనర్ కట్టా లక్ష్మి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. పట్టణానికి చెందిన చామర్తి శ్రీరాములు రూ.10,116, యరకారెడ్డి వెంకటరెడ్డి (గండేపల్లి) రూ.5,116 ఆలయ అభివృద్ధికి విరాళంగా అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. చిట్లూరి సుబ్బరావు ఆధ్వర్యంలో శ్రీ నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం ప్రసాద వితరణ చేశారు.

అన్నదాన కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసపురానికి చెందిన వసంతాటి శివాజీ అన్నదానం చేసినట్టు సేవా సంస్థ ప్రతినిధి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి ఆదిత్య, ముప్పిడి శ్రీనివాసరావు, ముప్పిడి అంజి, పోల్నాటి శ్రీనివాసరావు, ప్రతిపాటి రాజారావు, జుజ్జవరపు శ్రీను, తానిగడప రాజశేఖర్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం: వినాయక నిమజ్జనానికి జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం వద్ద పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు లక్కవరం ఎస్సై డి.శశాంక తెలిపారు. శుక్రవారం ఎర్రకాలువ జలాశయం వద్ద ఏర్పాట్లను ఆమె ఏఎస్సై భాస్కర్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. జంగారెడ్డిగూడెం మండలంతో పాటు కామవరపుకోట మండలాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఎర్రకాలువ జలాశయంలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు తీసుకువస్తారని శశాంక తెలిపారు. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల మధ్య ఎక్కువగా జరిగే నిమజ్జనాల సమయంలో ప్రమాదాలు జరగకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జలాశయం వద్ద భారీ లైటింగ్‌తో పాటు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిపై తహసీల్దార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని శశాంక చెప్పారు.


కేకేఎం ఎర్రకాలువ జలాశయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్సై శశాంక